



# సమిధలు

చందక రాజారామమోహనరావు

పైన సీలింగు ఫేను గిర గిర తిరుగుతోంది గాలికి సిగరెట్టు పొగ తైల సంస్కారంలేని జుట్టులా చెదురుతోంది మంత్రి కరుణాకరరావు తాపీగా సిగరెట్టు కాల్చుకుంటూ పై కప్పు కేసి చూస్తూ ఆలోచిస్తున్నాడు పోర్టికోలో కారాగిన చప్పుడైంది

ఎండలు మండి పోతున్నాయ్ బావా! ప్రయాణం చేయలేక చచ్చాననుకో నుదుటి మీద చెమటను తుడుచుకుంటూ లోపలికొచ్చేడు ప్రబాకరం

ప్రబాకరం కరుణాకరరావుకి బావమరిది తన చెల్లెల్ని నాలుగు లక్షల కట్నంతోపాటు సఘర్పించుకొని ఆ అర్హత పొందేడు కట్నం కాస్త ఎక్కువే అనిపించినా కోనసీమలో పాతికెకరాల కొబ్బరి తోట పట్నంలో చిన్న సైజు ఫ్యాక్టరీకి స్వంతదారుడైన కరుణాకరానికి కట్నాల మార్కెట్టులో ఆ మాత్రం బేరం పెట్టక తప్పలేదు అయినా తర్వాత తను ఆ కట్నం గురించి బాద పడలేదు కారణం కరుణాకరరావు రోజు రోజుకూ పెరిగి పోయేడు నిత్యావసర వస్తువుల దరల్లా – వార్డు మెంబరుగా డిపాజిట్టురానివాడు జయలక్ష్మిని కట్టుకొని ఎం ఎల్ ఎ అయ్యేడు ఆవిడ చేసుకున్న పుణ్యమో – ప్రజలు చేసుకున్న పాపమో అతను మంత్రి కూడా అయ్యేడు ఆ నాటి తన చిన్న పెట్టుబడి యింత బారీ వ్యాపార మౌతుందని ప్రబాకరం ఊహించలేదు

ఎంటి యింత అర్జెంట్‌గా దిగేవ్ మధ్యంతర ఎన్నికల్లా? కుర్చీ చూపించేడు కరుణాకరరావు

ఎంలేదు బావా! చిన్న పనుండి- చెప్పడం మొదలు పెట్టేడు

ప్రబాకరం లయన్సు క్లబ్బు ప్రెసిడెంటు క్లబ్బు బిల్డింగు కట్టడానికి స్థలం కావాలి ఊర్లో గవర్నమెంటు పోరంబోకు ఖాళీగా వుంది ఉంది గదా అని పనీ- పాట- తల- తోక లేని అడ్డమైన బీదోళ్ళు గుడిసెలేసుకొని కాపురాలు పెట్టేశారు మీకు యిల్లు లేకపోతే కొంపలేం మునగలేదు అసలు కొంపలే లేకపోతే మునిగే ప్రమాదమే లేదు అవతల క్లబ్బుకు బిల్డింగులేక జనం తెగ యిబ్బంది పడిపోతున్నారు మీరు స్థలం ఖాళీ చెయ్యండి అని నయానా భయానా చెప్పినా వెధవలు వినడంలేదు పిల్లా జెల్లతో మేం ఎక్కడి కెళ్తాం- ఖాళీ చెయ్యం పొమ్మన్నారు

అదీ బావా కథ! ఆ జులాయి వెదవలు ఒక పట్టాన ఖాళీ చేసేలా లేరు ఆ బిల్డింగు వెంటనే కట్టాలి అందులోనూ దానికి ప్రారంబోత్సవం కూడా నువ్వే చెయ్యాలి చెప్పడం ముగించేడు ప్రబాకరం

ఓస్ అంతేకదా! అదేమైనా సారా కొట్లో – ముండల కంపెనీయో అయితే ఖాళీ చేయించడం కష్టంగానీ గుడిసెలేకదా! తన్ని ఖాళీ చేయిస్తాం నువ్వేం కంగారు పడకు భుజం మీద చెయ్యేసి మరీ చెప్పేడు కరుణాకరరావు

అంతేకాదు ప్రారంబోత్సవం నీ చేతి మీదే జరగాలి మరొక్కసారి చేతిలో చెయ్యేయించుకున్నాడు ప్రబాకరం

తల్చుకున్నది రాజైతే దెబ్బలకేం కొఱవ పెద బొబ్బలకేం లోటు రెండు బుల్‌డోజర్లు తరలి వచ్చేయి రెండు స్టేషన్ల పోలీసులు బిలబిలమంటూ దిగేరు లారీల జోరు- యింజన్ల హోరులో అరుపులు- ఆర్తనాదాలు ఎడుపులు పెడబొబ్బలు కలిసి పోయేయి గుడిసెలు నేల మట్టం కాగా ఆర్నెలల్లో ముచ్చటగా క్లబ్బు బిల్డింగు మొలుచుకొచ్చింది

ఆడిన మాట తప్పలేదు మంత్రివర్యులు అదీ బావమర్దికిచ్చిన మాట ప్రారంబోత్సవానికి సపరివారంగా విచ్చేశారు ఓట్లు – నోట్లు తర్వాత ఆయన కిష్టమైనవి ప్రారంబోత్సవాలే సారా కొట్టు దగ్గర్నుంచి బార్బర్ షాపు వరకూ ప్రారంబోత్సవం అంటే దేన్నీ వదలరు ఎటు పోయెటు వస్తుందో అని జేబుల్లో ఎప్పుడూ రెండు కత్తెర్లు సిద్ధంగా వుంచుకుంటారు ప్రారంబోత్సవాలకి

క్లబ్బు నిర్మాణానికి అవిరామ కృషి చేసిన

ప్రబాకరాన్ని (చందాలు వసూళ్లలో ఆమధ్యన నిద్రాహారాలు పూర్తిగా దూరం చేసుకున్నారుతెండి మనసారా అబినందించేరు అమాత్యులు దేశ సౌబాగ్యంలో క్లబ్బుల పాత్రను నొక్కి వక్కాణించేరు వక్తలు సిగ్గుతోనూ- దండలతోనూ తలదించేసుకున్నాడు ప్రభాకరం తనవంతు వచ్చేసరికి మైకు ముందు హుందాగా నిలబడ్డాడు ఈ కార్యక్రమం మంత్రిగారి చేతుల మీద జరగడం తన కెంతో యిదైందన్నాడు ఆయన ప్రారంభిస్తే అదెంతగా పెరిగి పోతుందో చేతి చలువ గురించి మరీ మరీ పొగిడేరు యీ మద్యనే వారు ప్రారంబోత్సవం చేసిన పిచ్చాసుపత్రి 30 పడకల నుంచి 300 పడకల దాకా ఎలా పెరిగి పోయిందో సోదాహరణంగా మరీ వివరించేరు నాటుసారా తో ప్రారంబమ్మైన లోవ రాజు కొట్టు వెంకటేశ్వరా వైన్స్ గా ఎలా రూపాంతరం చెందిందో విడమర్చి మరీ చెప్పేరు ముఖ్యంగా మంత్రిగారు కార్య బారంతో తల మునకలుగా వున్నప్పటికి అన్ని పనులు వదులుకొని (అమ్మాయి అన్నప్రాసన తిరుపతిలోనా యాదగిరి గుట్టలోనా అనే విషయం అదిష్టాన వర్గంతో చర్చించి నిర్ణయించాల్సిన అతి ముఖ్యమైన పని) యిక్కడకు విచ్చేసినందుకు వారికి ఎలా కృతజ్ఞతలు చెప్పుకోవడమో తెలీతేదంటూ మరీ మరీ యిదై పోయేడు

సన్మానాలూ - చప్పట్లు అంటే నాకు చిరాకు మంత్రి కరుణాకరరావుగారు ఉపన్యాసం మొదలు పెట్టేరు సబలో చప్పట్లు అవి ముగిసే వరకూ ఒక్క నిముషం ఆగేరు పూలదండలు వేసుకుంటే ఒంటిపై జెర్రులు పాకు తున్నట్లుందని తెగ బాద పడిపోయేరు దండ సర్దుకుంటూ యీ క్లబ్బు కట్టించిన ఘనత ప్రబాకరంది కాదే కాదన్నారు రాళ్లెత్తి - యిటుక మోసి- సిమెంటు కలిపిన శ్రమ జీవులు- కూలి సోదరులే ఈ బవన నిర్మాణంలో కధానాయకులన్నారు రిబ్బను కత్తిరించినంత మాత్రాన దండలు వేసుకునే అర్హత తనకు లేదన్నారు పనిలో- కార్ఖానాలో రెక్కలు ముక్కలు జేసుకొని యీ కత్తెర తయారు చేసిన కార్మిక సోదరులే దానికి అర్హులన్నారు అంటూ తమ మెడలోని పూల దండల్ని తీసి సభలోకి విసిరేరు యీ సారి చప్పట్లతో సబ మారు మ్రోగి పోయింది విందులు- చిందులు అంటే తనకు పట్టవని ఆకల్తో అల్లాడి పోయే బీదవాడికి కాస్త అన్నం పెడితే తనతో పాటు ఢిల్లీ కూడా సంతోషిస్తుందని శెలవిచ్చేరు చప్పట్లు క్లబ్బు బాధ్యత దీంతో తీరిపోలేదని బీదవాళ్లకు ఏదో ఒకటి చేస్తేనే- క్లబ్బు- ప్రభాకరం- ప్రారంబోత్సవం చేసిన తమ బ్రతుకు కూడా ధన్య మౌతుందని నొక్కి వక్కాణించేరు మళ్లీ చప్పట్లు బీదరికంలో పుట్టి బీదరికం భరిస్తూ అందులోనే చచ్చి పోయే బీదవారంటే తమకు ప్రాణంతో సమానం అన్నారు తను తన పార్టీ కూడా బీదల కోసమే పుట్టి బీదల్లోనే పెరిగి బీదల కోసమే జీవిస్తుందన్నారు తనకు తన పార్టీని కూడా వచ్చే ఎన్నికల్లో గెలిపించి దేశాన్ని కాపాడు కొనే బాధ్యత ముఖ్యంగా బీద వాళ్లదే అని బల్ల గుద్ది మరీ హెచ్చరించేరు యీ ప్రారంబోత్సవానికి మంత్రి పుంగవులు చెప్పేదానికి సంబంధం ఏమిటో ఎవ్వరికీ అర్ధం కాలేదు అయినా చప్పట్లు చాలా భారీ ఎత్తున మారు మ్రోగేయి! యిప్పటికైనా ఉపన్యాసాన్ని ముగించి వారిని రక్షిస్తారనే ఆశతో

ఆయనకు ప్రజానాడి ప్రజా ఘోష తెలుసు ప్రస్తుతానికి తను చేయాల్సిన ప్రజా సేవ ఉపన్యాసాన్ని ఆపు చెయ్యడమే అనిగ్రహించేరు సబ ముగిసింది

*   *   *

యాదగిరికి బీదవాళ్లలోనూ కార్మికులలోనూ చాలా పేరుంది గత పది సంవత్సరాలుగా శాసన సభలో ప్రతిపక్ష సభ్యుడిగా అతని వాణి వినిపిస్తూనే వుంది కార్మిక సమస్యలు బూర్జువా సమాజంపై తిరుగుబాటు వ్యవసాయ కూలీల గురించి పోరాటం వీటన్నిటివల్లా అతను బీదలపెన్నిధి ప్రజా నాయకుడు అని చాలా పేర్లు సంపాదించుకున్నాడు కొన్ని పేర్లు ప్రజలు బహూకరిస్తే కొన్ని తనంతట తానే తగిలించుకున్నాడు తన మీద అపారమైన నమ్మకంతో ప్రభుత్వ కార్యాలయాల్లో సైతం అతని మాటకు తిరుగులేదు మంత్రి కాక పోతేనేం అంత హోదా పలుకుబడీ వున్నాయ్ అతనికి

ఆ రోజు వ్యవసాయ కూలీల సమస్యలు గురించి అసెంబ్లీ ముందు పెద్ద ప్రదర్శన ఊరేగింపు సత్యాగ్రహాలు జరుపాల్సి వుంది ఆలోచనలతో అతని బుర్ర వేడెక్కి పోయింది

రాజదానికి వచ్చిన ప్రతినిదులకు అన్ని సౌకర్యాలు చూడ్డంతో రెండ్రోజులు్నంచి అతనికి సకాలంలో తిండి- నిద్రలేక అలసినట్లుగా వున్నాడు మనస్సంతా బరువుగా ఒళ్లంతా బడలికగా వుంది ఆ రెండూ పోవాలంటే చిట్కా అతనికి తెలుసు బీరువా తెరిచేడు గ్లాసు నింపేడు చుక్క గొంతులో దిగేసరికి కొత్త హుషారొచ్చింది మందు కనిపెట్టిన మహానుబావులెవరోగాని వాడు విమానం టెలివిజను కనిపెట్టినోడు కంటే గొప్పవాడు అని మనస్సులోనే అబినందించేడు గ్లాసు క్రింద పెట్టి సిగరెట్టు వెలిగించి రెండు దమ్ములు గట్టిగా పీల్చేడు

అయ్యగారూ! తలుపు దగ్గర్నుంచి అబ్బులు బెరుకుగా పిలిచేడు

ఏంటీ? కనుబొమలు పైకి ఎగరేస్తూ అడిగేడు యాదగిరి

మా అయ్యకు జబ్బు చేసిందండి తమరు జీతం డబ్బులిస్తే- ఆడ్ని సూసొత్తాను పీలగా ఎర్రగా వుండే ఇరవయ్యేళ్ల అబ్బులు యాదగిరి దగ్గర పాలేరు ఎప్పుడు తన తండ్రి వాణ్ణి పదేళ్లప్పుడు కొలువులో పెట్టేడు యీ పదేళ్లలో వాడు తండ్రి దగ్గరికి ఏ రెండుసార్లో వెళ్లేడు అబ్బులుకి యజమానంటే బక్తి శ్రద్ధ అన్నీను


ఒక్క మంత్రే నాలుగు పోర్టు పోలియోలు చూస్తున్నట్లు ఇంటి పని- బయట పని వ్యవసాయం అన్నీ చూస్తుంటాడు తల్లీ- తండ్రీ అన్ని వాడికి యాదగిరే అయితే నౌకరు పనివాడు విశ్వాసంగా వుండే కుక్క యివన్నీ అబ్బులే యాదగిరికి

మీ అయ్య దగ్గరికెళ్తే యిక్కడి పనులెవడు చూస్తాడురా మీ తాతా?

ఒక్క రోజులో ఎల్లొచ్చేత్తాను తల వొంచుకొనే మారు పలికేడు అబ్బులు

ఒక్క గంట కూడా వీలులేదు వాడికి జబ్బు చేస్తే నువ్వు చేసే దేమిట్రా నువ్వేమైనా డాక్టరా?

మా అయ్యకు చానా పెమాదంగా వుందండి



ఉంటే ఛస్తాడా ? చస్తే చావనీ ! నువ్వేమైనా అపుతావా?

సచ్చే ముందు ఒక్కసారి సూసొద్దామని

వెధవ్వేషాలెయ్యకు పరామర్శించడానికి వాడేమైనా రాజకీయ నాయకుడా ? సినిమా యాక్టరా? దేశంలో రోజూ ఎంతో మంది చస్తూ వుంటారు ఎవడికంటే గొప్పరా మీ అయ్య నోరు మూసుకొని పని చూసుకో పో యాదగిరిలోని ప్రతిపక్ష సభ్యుడు హుంకరించేడు

ఎల్లనీయకపోతే పోయేరు పోనీ జీతం డబ్బులన్నా యిప్పించండి ఎవరితోనైనా పంపిస్తాను

జీతమా? అదెక్కడుంది? యీ దేశానికి కమ్యూనిస్టు ప్రధాన మంత్రి అయినంత ఆశ్చర్యం ధ్వనించింది అతని కంఠంలో

పదేళ్ల బట్టి నాకు జీతం యివ్వలేదు కదండి అవసరమైనప్పుడు అట్టే కెల్లొచ్చని నేనూ అడగలేదు అబ్బులు గొంతులో భయం వినిపించింది

ఆహా! తవరికి జీతం కూడా యివ్వాలే పదేళ్లబట్టి నిన్ను పందిని మేపినట్టు మేపింది చాలక బట్టలిచ్చి మందులిచ్చి జిల్లా పరిషత్తు ఎలక్షన్లో సమితి ప్రెసిడెంట్లను మేపినట్టు మేపుతుంటే యింకా నీకు జీతం కూడా యివ్వాలే

మీ యింటికి కుక్క కావలి కాసేను రేయి పగలు ఎండ వాన యివేమీ లెక్క చేయక రెక్కలు ముక్కలు చేసుకొని మీ నౌకరీ సీసేను ఏదో తిండి ఎట్టేనని నా జీతం డబ్బులు ఎగ్గొట్టడం తవరికి దరమం కాదు బాబయ్యా యీ ఒక్కసారీ నాకు పదవీ భిక్ష పెట్టండని అధిష్ఠానం ముందు చేతులు చాపుకున్న నాయకుడిలా వుంది అబ్బులు వాలకం

ఒరేయ్ నా బుర్ర పాడు చెయ్యక మర్యాదగా బయటి కెళ్ళు నా కవతల బోలెడు పనులు వ్యవసాయ కూలీల సమస్యలు ఎన్నో వున్నాయి నీ వెధవ హరి కథలు వినడానికి నాకు టైంలేదు బయటకు పో సింహంలా గర్జించేడు

# సమిధలు

హు సమసెలు ఎందుకు బాబయ్యా యీ కవుర్లు మీ ఇంట్లో నౌకరి కట్ట సుకాలు సూదరుగాని దేశంలో అందరి సమిసెలు సూత్తారా? కన్న తండిరి సావబోతుంటే ఎల్లనీయని తవరు ఎట్టి సాకిరీ గురించి పేపర్లో వాంతులు సీసుకుంటారా? ఇదేనా తవరి నాయం ?

పిల్లి కూనలా పడి వుండే అబ్బులు తనని యిన్ని మాటలు నిలదీసి అడుగుతుంటే యాదగిరికి మతిపోయినంత పనైంది యీ దేశానికి చెడ్డ రోజులు పట్టలేదు కదా! అని భయపడి పోయేడు ఇందులో కేంద్రం కుట్ర లేదుగదా అని కూడా అనుమానమొచ్చింది అమెరికావాడు రష్యావోడు కలిసి సినిమా తీసినంత విచిత్రంగా వుంది తనకు యీ కుర్ర వెధవ తనకు నీతులు చెప్తాడా? కాబూలీవాలాకు రిక్షావాలా ఎదురు తిరగడమా? అవమానంతో కళ్ళు చింత నిప్పులై పోయేయి బల్ల మీద ఖాళీ గ్లాసు తీసి అబ్బులు బుర్ర మీద బాదేడు రక్తంతో తడిసి పోయిన వాణ్ణి బయటకు గెంటేసి వ్యవసాయ కూలీల ఉద్ధరణ కు బయలు దేరేడు

ఊరేగింపు అదిరిపోయింది బూర్జువా సమాజంలో వ్యవసాయ కూలీలకు జరుగుతున్న అన్యాయాలూ అరాచకాలు ఘోరాలు అన్నీ ఏకిపారేసాడు యాదగిరి సింహంలా గర్జించేడు మేఘంలా ఉరిమేడు మెడ పూలదండల మధ్య యిరుక్కుపోయింది అతని ఫొటోలతో పేపర్లన్నీ నిండి పోయేయి ఉద్యమం సంగతి ఏమైతేనేం – ప్రభుత్వాన్ని ఏకిపారేసినందుకు అతన్ని ప్రజలు ఆకాశానికి ఎత్తేసారు యీ హడావిడిలో అబ్బులు గాడి చావుకేక ఎవ్వరికీ వినిపించలేదు

* * * * *

దిన పత్రిక తిరగేస్తున్న కరుణాకరరావు మండిపడిపోతున్నాడు యీ మధ్యన పేపర్లంటే అతనికి బొత్తిగా పడటంలేదు ప్రతి చిన్న విషయాన్నీ పెద్దగా కొంపలు మునిగిపోతున్నట్టు ప్రచారం చేస్తుంటే అతనికి అరికాలు మంట నెత్తికెక్కుతోంది పోలీస్ స్టేషన్లో నలుగురు పోలీసోళ్ళు అర్ధరాత్రి ఆకలేసి మందుతో పాటు ఒకమ్మాయిని నంజుకుటే అదేదో పెద్ద మాన భంగమా? దేశంలో వున్న సంపదను సమానంగా పంచి సోషలిజాన్ని తీసుకొచ్చే ప్రయత్నంలో ఒక మంత్రిగారు బావమరిదికి ఏదో వందెకరాల స్థలం యిప్పిస్తే అది భూమి ఆక్రమణా? కాంట్రాక్టరు మందు మైకంలో సిమెంటు వేయడం మర్చిపోయి వంతెన కడితే ప్రమాదవశాత్తు వంతెనకూలి ఓ వందమంది చస్తే మాత్రం అంత మాత్రానికే మంత్రివర్గం అంతా రాజీనామా చేసెయ్యాలా? చీ చీ చీ ప్రజల్ని రెచ్చగొట్టి ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసేస్తున్నాయ్ చదువుతున్న పేపర్ని విసిరి కొట్టేడు

గుమ్మందగ్గర గాజుల సవ్వడి వినిపించి తలఎత్తి చూసేసరికో ముద్దుగుమ్మ ముచ్చటగా నమస్కారం చేస్తూ నిలబడి వుంది

ఎవరు నీవు ఏం కావాలి? లైటేస్తే చీకటి పారి పోయినట్టుగా చికాకంతా మాయమై పోయిందతనికి

ఆమె దగ్గరగా ఒచ్చింది పాతికేళ్ళుండొచ్చు సన్నగా – నాజూగ్గా తెల్లగా వుంది ఎక్కడ వుండాల్సిన హంగులు అక్కడ వుండి చెయ్యి తిరిగిన శిల్పి మలిచిన శిల్పంలావుంది చక్రాల్లాంటి కళ్ళు కదలిస్తూ తనకథ చెప్పింది

ఆవిడ ఒక హైస్కూలులో టీచరట ఆమె భర్తగారు కూడా డిటో డిటో యేనట వాళ్ళకి పెళ్ళయి ఆరేళ్ళయిందట ఒక్కరోజు కూడా వాళ్ళిద్దరూ కలిసి ఒకచోట ఉద్యోగం చెయ్యలేదట కారణం అధికార్లు చెయ్యనీయలేదు దానికి కారణం ఆమె అందమేనట అసలు కారణం ఆ అందాన్ని నలుగురికి పంచి యివ్వలేదట సోషలిజంలా అయిదేళ్లలో ఆవిణ్ణి పదూర్లు తిప్పేరట ఆవూర్లలో భర్త ఉద్యోగం చేస్తున్న ఊరుమాత్రం లేకుండా చాలా జాగ్రత్తలు తీసుకున్నారట చెప్పడం ఆపుజేసి రెస్పాన్సుకోసం అతని ముఖంలోకి చూసింది

మంత్రిగారి ముఖం గంభీరంగా వుంది చెప్పు అన్నట్టు చూసేడాయన

మా భార్యాభర్తల్ని యిద్దర్ని ఒక చోట చేర్చి పుణ్యం కట్టుకోండి వినయంగా చేతులు జోడించింది

అంతా విని మంత్రిగారు కరిగిపోయేరు యీ దేశంలో ఆడదాని మీద యింత అఘాయిత్యమా? అని మండి పడ్డారు

దానికి కారణం నేను కాదు అన్నట్టు చూసిందావిడ

కోనసీమలోని ముమ్మిడివరం తాలూకా గొల్లవిల్లి గ్రామంలో ఇటీవల సైన్సు పరిషత్ ఎనిమిదవ మహాసభలో ప్రసంగిస్తున్న శ్రీ పి శివశంకరం (రసాయనిక శాస్త్ర విభాగం అధిపతి) శ్రీ కె వి రమణ (ప్రధానోపాధ్యాయులు) శ్రీ మంథా సాంబశివశాస్త్రి (గణిత శాస్త్రోపన్యాసకులు) డా శ్రీ యస్ రవికుమార్ (ఉప విద్యాశాఖాదికారి) శ్రీ సి వి సర్వేశ్వరశర్మ (కోనసీమ సైన్సు పరిషత్ ప్రెసిడెంట్)లని చిత్రంలో చూడవచ్చు



నేను మాట్లాడి అన్నీ సరి చేస్తాను సాయంత్రం గెస్ట్ హవుసుకి రా ఆర్డర్సు చేతికి వస్తాయి అభయమిచ్చేడాయన

ఆర్డర్సు తీసుకోవడానికి గెస్ట్ హవుసెందుకో మొదట అర్ధం కాలేదావిడకు వెళ్ళింతర్వాత అర్ధ మైంది ఎందుకు రమ్మన్నాడో యీ వ్యవస్థలో ఉద్యోగం చేసే ఆడదానికి వళ్ళు దాచుకుంటే కుదరదని ఢిల్లీ నుంచి గల్లీ దాకా అంతేనని యిప్పుడే తెలిసింది తన మొగుడితో కలసి కాపురం చేయాలనుకుంటే ఒక్క రాత్రి పరాయి కాపురం తప్పదని బలవంతంగా తెలుసుకుంది మంత్రిగారి ఆకలి తీరింది ఆవిడ అవసరం గడిచింది

* * *

కట్నాల పిశాచానికి బలైపోయిన కూతురిని కన్న తండ్రి హృదయంలా ఎండలు మండిపోతున్నాయ్ వడ గాలులు వీస్తున్నాయ్ మండుటెండలో మిట్ట మధ్యాహ్నం ప్రయాణం చేస్తున్నాడు యాదగిరి రోడ్డుని దూరాన్ని చీల్చుకుంటూ పరుగెడుతోంది అతని కారు ఎన్నికల ప్రచార సభల్లో వరుసగా పాల్గొంటున్నాడు అతను ప్రతి పక్ష సభ్యుడిగా ప్రభుత్వం చేస్తున్న అవకతవక పనుల్ని ఊరూరా తిరిగి ఏకేస్తున్నాడు ఎన్నికలు దగ్గరవడంతో మనస్సుకు శరీరానికి కూడా విశ్రాంతి లేదతనికి

దాహంతో నాలుక ఎండిపోతోంది వాటర్ బేగ్‌లో నీళ్ళు అయిపోయేయి దార్లో చుక్క నీరు కూడా కనిపించడంలేదు త్రాగడానికి యీ దేశంలో అన్నం కంటే నీటి సమస్య ఎక్కువగా వుందే అనుకున్నాడు అంత దాహంలోనూ అతనికో ఆలోచన వచ్చింది వచ్చే వూర్లో ప్రభుత్వాన్ని యీ సమస్య మీద ఏకెయ్యొచ్చు తన ఆలోచనకు తనకే నవ్వొచ్చింది ఆలోచనలకంతరాయం కలిగిస్తూ రోడ్డు ప్రక్క కల్లు పాక కనిపించింది యాదగిరికి ప్రాణం లేచొచ్చింది నీళ్ళు లేకపోతేనేం కల్లు చాలదా అనుకున్నాడు చిన్న కుదుపుతో కారాగింది కారు బేరం తగిలేసరికి ఉత్సాహంతో ఉరకలేస్తూ పాకలోంచి పరుగెత్తుకొచ్చింది కల్లు అమ్ముకునే రత్తి వరసగా నాలుగ్గ్లాసులు పుచ్చుకొనేసరికి దాహం తగ్గింది

ఇంకొక గ్లాసు కావాలా? అన్నట్లు చూసింది రత్తాలు

మనసు కుదుటబడ్డ యాదగిరి అప్పుడే రత్తికేసి సరిగా చూసేడు

అందంగా బలంగా ఆకర్షణీయంగా ముఖం మీద ముత్యపు చుక్కల్తో ఎండకు గాలికి చెదిరిన ముంగురులు వింత అందాన్నిస్తుండగా రత్తి బీదవేషం వేసుకున్న సినిమా స్టారులా వుంది చెమటకు కరిగిన కుంకుమబొట్టు నీటిలో చంద మామలా వుంది రవిక లేక పోవడంతో అదుపూ – ఆపూలేని సంపద వొగరెక్కి నిక్కి నిక్కి చూస్తూ బయటకు పొడుచుకొస్తూ వుంది రత్తిని చూసే సరికి యాదగిరికి మరో ఆకలి గుర్తొచ్చింది తను

## "లోకం పోకడ"

లోకం కోడై
కూస్తోంది
వరకట్నం కోసం
వధువును
హింసించ వద్దని!
కోడిపిల్ల నొక్క
కుక్కలు
ఉన్నంతకాలం
వినపడదు
ఎవ్వరికీ
ఆ కోడికూత!

–కె. వి. సూర్యలక్ష్మి

# సమిధలు

యింటిదగ్గర్నుంచి బయలుదేరి చాలా కాలమైందని గుర్తుకు రావడంతో అవసరం మరీ పేట్రేగి పోయింది గ్లాసుతోపాటు రత్తి చెయ్యి కూడా అందుకున్నాడు యాదగిరి జరగబోయేది తెలుసుకున్న రత్తాలు విసురుగా చెయ్యి లాక్కోబోయింది కాని కుదరలేదు అంతకు ముందే కారు తలుపులు తీసి బలవంతంగా వొళ్ళోకి లాక్కున్నాడు రత్తి అరుపులు విన్న దాని మొగుడు పాకలోంచి పరుగెత్తుకొచ్చి కారుకు అడ్డంగా నిలబడ్డాడు ఒక్క తోపు తోసి కారుని దూకించేడు డ్రైవరు కార్లోంచి బయట పడాలని రత్తి విశ్వ ప్రయత్నం చేసింది కోడిపెట్టలా గింజుకుంది అయితేనేం తన ఆకలి తీరేదాక వదల్లేదు యాదగిరి ఒళ్ళు తిమ్మిర్లు తగ్గింతర్వాత కార్లోంచి రోడ్డుమీదకు విసిరేసాడు మామిడి టెంకను విసిరేసినట్లు తాగిందానికి డబ్బులు కూడా యివ్వకుండా పక్కవూర్లో మీటింగుకు ముందుకు సాగిపోయేడు యాదగిరి

★ ★ ★

కార్ల హారన్లతో మైకుల హోరుల్తో ఊరంతా హడావిడిగా వుంది ఎన్నికల బహిరంగ సభలో ప్రసంగించడానికి మంత్రి కరుణాకరరావుగారు విచ్చేశారు వేదిక ఎక్కి గంబీరంగా ఉపన్యాసం మొదలెట్టారు తనకు తన పార్టీకి గల గత చరిత్రనంతా ఏకరువు పెట్టేరు తన జీవిత మంతా మహిళలు బీదవారి ఉద్ధరణకే అంకితం చేసేనని ఉదాహరించారు ఇంతకాలం మీరు ఆశించిన సహకారంతోనే తన వారికి సేవ చేసుకో గలిగేనని విన్నవించేరు మరొక్క సారి ప్రజల్ని సేవించుకొనే మహద్భాగ్యాన్ని ప్రసాదించమని ఓట్లు బిక్ష పెట్టమని అర్ధించుకున్నాడు తను చేస్తున్న ప్రజా సేవకు ప్రతిపక్షాలు అడుగడుగునా ఎలా అడ్డం తగుల్తున్నారో చెప్పుకుంటూ నెత్తీ నోరూ బాదుకున్నాడు దగ్గర్లో గుద్ది చెప్పడానికి బల్ల లేకపోవడంతో మహిళలు బీదలు– వీళ్లను ఉద్ధరించాలంటే తనను బల పర్చవలసిన అవసరం ఎంతైనా ఉందన్నాడు! దేశానికి ఆ రెండూ తప్ప వేరే సమస్యలు లేనట్లు తనను తన పార్టీని గెలిపించుకొని ప్రజా స్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని అంతా వారిమీద నెట్టేసి ఆయన సభ ముగించేడు

* * *

ఉపన్యాస కేసరి– దీనబాంధవుడు ప్రజాసేవకుడు కార్మిక కర్షక శ్రేయోబిలాషి యాదగిరి ఎన్నికల ప్రచార సభకు జనం విపరీతంగా వచ్చేరు కుచ్చెళ్ళు సర్దుకుంటున్న హీరోయిన్ని చూస్తూ నిలబడే నిర్మాతలా యాదగిరి ఏం చేస్తాడా అని అతని నోటికేసి చూస్తూ నిలబడి పోయేరు

యాదగిరి గళం విప్పి ప్రభుత్వాన్ని దూదేకినట్లే కీసాడు ప్రభుత్వం కుళ్ళి పోయిందన్నాడు ఢిల్లీ పెద్దల దగ్గర వెట్టి చాకిరికి అలవాటుపడ్డ యీ నాయకులు వెట్టి చాకిరినేం నిర్మూలించగలరని సూటిగా ప్రశ్నించేడు ఆడదాన్ని గౌరవించే మన సంస్కృతిలో ఆడది ఆట వస్తువై పోయిందని తెగ బాధ పడిపోయి ఆ బాదలో పూలదండల్ని నలిపి నలిపి తునా తునకలు చేసేసేడు జుత్తు పీక్కున్నాడు చొక్కాగూడా చించుకోబోయేడు కాని పక్క వూర్లో మీటింగు గుర్తొచ్చి ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడు మహిళలకు– అల్ప సంఖ్యాకులకు న్యాయం జరగాలంటే ఆకాశాన్నంటుతున్న అవినీతి– నానాటికి పెరిగి పోతున్న బలహీన వర్గాలపై అఘాయిత్యాలు మానవ జాతికే మహా అవమాన కరమైన మానభంగాలు వీటన్నిటిని శాశ్వతంగా సమాధి కట్టి సముద్రంలో కలిపెయ్యాలంటే తను తన పార్టీ తప్ప వేరే మార్గం లేదని మరీ గుర్తు చేస్తూ వేదిక దిగి పోయేరు

ఎన్నికలు కొన్ని కోట్ల ఖర్చుతో ముగిసాయి కరుణాకరరావు మామూలుగానే మంత్రి అయ్యేడు యాదగిరి కూడా యదాప్రకారం ప్రతిపక్ష నాయకుడయ్యేరు ఇద్దరూ తమ పంథాలో ప్రజా సేవ చేస్తూనే వున్నారు ఎన్నికల మహాయాగంలో బీద వాళ్ళు మహిళలు సమిథలుగా మండిపోతున్నంత కాలం యాదగిరులు – కరుణాకరరావులు దేదీప్యమానంగా వెలుగుతూనే వుంటారు – □

21 12 84

## అంకితం

నాకు జన్మనిచ్చి నా మీద ఎన్నో ఆశలు పెట్టుకుని నేనేమైపోయానో చూసుకోకుండా మరో లోకాలకు వెళ్ళిపోయిన స్వర్గీయ మా తండ్రిగారు శ్రీ చందక అప్పారావు కు

– రచయిత